క్లుప్తంగా

టీడీపీ జెండా ఆవిష్కరణలో తమ్ముళ్ల వాగ్వాదం!



గొడవ పడుతున్న టీడీపీ నాయకులు

సంతబొమ్మాళి: టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నౌపడలో పార్టీ జెండా ఆవిష్కరణ సమయంలో నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి తనకు ఆహ్వానించి రాకుండానే ఎగరవేయడం ఏమిటని ఆ పార్టీ సీనియర్ నాయకుడు చెన్నూరు బాబ్జీ నిలదీశారు. దీనికి కార్యకర్త మహంతి రాజు బదులిస్తూ.. ఇది వ్యక్తిగత కార్యక్రమం కాదని.. నీ ఇష్టం వచ్చినప్పుడు వస్తే గంటల తరబడి ఎవరూ నిరీక్షణ చేయరన్నారు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి పరుష పదజాలంతో దూషించుకున్నారు. అక్కడ ఉన్న మిగిలిన నాయకులు సర్దిచెప్పి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.

తీరాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న సీఐ రమేష్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: తీర ప్రాంతాన్ని మనమే కాపాడుకుందామని బారువ కోస్టల్ మెరైన్ శాఖ సీఐ డి.వి.జె.రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. డొంకూరు సముద్ర తీర ప్రాంతంలో స్థానికులతో కలిసి శనివారం శ్రమదానం చేసి చెత్తా, చెదారాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్, గాజు సీసాలు, కాగితాలతో పర్యాటకులు కలుషితం చేస్తుంటారని, మన బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ కోదండరాజు, స్థానిక నాయకుడు బుడ్డ కళ్యాణ్, మత్స్యకార సొసైటీ ప్రతినిధి చీకటి కృష్ణయ్య, సొసైటీ అధ్యక్షుడు చలప రాయి గురుమూర్తి ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

సోంపేట: బెంకిలి, జింకిభద్ర పంచాయతీల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. జింకిభద్ర మాజీ సర్పంచ్ పోకల వెంకటరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో అతన్ని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెంకిలిలో కోట గణపతి ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు. కంచిలి మాజీ ఎంపీపీ ఇప్పిలి క్రిష్ణారావు, కోటరాజు ఉన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో గణేష్ ప్రతిభ



గణేష్‌ను అభినందిస్తున్న భాస్కరరావు

కాశీబుగ్గ: మహారాష్ట్రలోని షిర్డీలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు 62వ జాతీయ జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. ఇందులో పాల్గొన్న పలాసకు చెందిన ఆర్.గణేష్ 65 కేజీల విభాగంలో ఆరో స్థానంలో నిలిచాడు. ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ, కోచ్ నెయ్యిల భాస్కరరావు సర్టిఫికెట్‌ను గణేష్‌కు అందజేశారు. గణేష్‌ను స్థానిక బాడీబిల్డింగ్ సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు జోగారావు, వేణుగోపాలరెడ్డి, సోమేష్, గౌతమ్, ఉమా తదితరులు గణేష్‌కు అభినందించారు.

రెండు ఇళ్లలో చోరీ

సోంపేట: సోంపేట పట్టణంలోని దుర్గాగుడి సమీపంలో శనివారం వేకువజామున రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై లవరాజు తెలిపారు. ఇప్పిలి గంగారావు, బెందాళం రామ్మోహనరావు ఇళ్లలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు వచ్చినట్లు పేర్కొన్నారు. ఎవరూ ఇంట్లో లేని సమయంలో దొంగలుచొరబడి ఒక ఇంట్లో రూ. రెండు వేలు, మరో ఇంట్లో రూ. నాలుగు వేలు పట్టుకొని పోయినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ బి.మంగరాజు, క్లూస్ టీం చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు.

రైలు నుంచి జారిపడి వృద్ధురాలి మృతి



సరస్వతమ్మ (ఫైల్)

తుని: తుని నుంచి అన్నవరం వైపు వెళ్తున్న రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి సోషల్ మీడియా ద్వారా అన్ని పోలీసు స్టేషన్లలో విచారణ చేయగా పలాసకు సమీపంలోని సైలాడ గ్రామానికి చెందిన అట్టాడ సరస్వతమ్మ (70)గా గుర్తించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నిలబడినా?

- పాఠశాలలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- సర్కార్ మారడంతో నిలిచిపోయిన 'నాడు–నేడు'పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



అర్ధాంతరంగా నిలిచిపోయిన పూర్ణబద్ర పాఠశాల పనులు

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. అన్నిరకాల మౌలిక సదుపాయాలను సమకూర్చడంతో కార్పొరేట్ పాఠశాలలను మించిపోయాయి. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కొన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు, భవనాల నిర్మాణాలు అర్ధాంతంగా నిలిచిపోయాయి. ఆ తరువాత ఏర్పాటైన కూటమి సర్కార్ వీటిని పట్టించుకోకపోవడం ప్రస్తుతం పాఠశాల భవనాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువు తీరి సుమారు పది నెలలు దాటినా అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణాలపై కనీసం దృష్టిసారించలేదు. దీంతో చాలాచోట్ల అరకొర సదుపాయాలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రానున్న విద్యా సంవత్సరంలోనైనా వీటికి మోక్షం లభిస్తుందా లేదా అనేది ప్రశ్నగా మిగిలింది. ప్రస్తుతం అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం శోచనీయం.

పలాస మండలంలో ఇలా..

పలాస మండలంలో మొత్తం 84 పాఠశాలలు ఉండగా వీటిలో 7,341 మంది చదువుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలకు పెద్ద పీటవేశారు. నాడు–నేడు పథకం కింద మండల వ్యాప్తంగా మొత్తం పాఠశాలలకు 83 అదనపు భవనాలకు నిధులు మంజూరయ్యాయి. విద్యార్థులకు కావల్సిన తరగతి గదులతో పాటు మంచినీరు, టాయిలెట్స్ నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఇందులో 50 తరగతి గదుల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా 33 అసంపూర్తిగా ఉన్నాయి. వాస్తవానికి ప్రభుత్వం మారకపోయి ఉంటే ఇవి కూడా పూర్తయ్యేవి. ప్రభుత్వం మారడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. ఇవి ఎప్పుడు పూర్తవుతాయో విద్యాశాఖ అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ముఖ్యంగా రంగోయి, నర్సిపురం, కిష్టిపురం, పూర్ణబద్ర, మొగిలిపాడు, పెంటవీధి, ఈదురాపల్లి, పెదంచల, రెంటికోట తదితర పాఠశాలల్లో భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్న పాఠశాలల్లో అసంపూర్తి భవనాల్లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. అటువంటి వాటిలో పూర్ణబద్ర పాఠశాలను ఉదాహరణగా చెప్పవచ్చు. వచ్చే విద్యా సంవత్సరంలోనైనా ఈ అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధుల కొరతతో ఆగిపోయాయి



మా పాఠశాలకు నాలుగు అదనపు తరగతి గదులు నాడు–నేడు పథకం కింద మంజూరయ్యాయి. కింద రెండు గదులకు శ్లాబ్‌లు పూర్తయ్యాయి. పైన రెండు గదుల నిర్మాణాలు ఆగిపోయాయి. నిధుల కొరతతోనే పనులు నిలిచిపోయాయి. నిర్మాణాలు పూర్తయితే తరగతి గదుల కొరత తీరుతుంది. నాడు–నేడు పథకం కింద టాయ్‌లెట్స్ పూర్తయ్యాయి. .

– టి.హేమారావు, హెచ్‌ఎం, జెడ్పీ ఉన్నతపాఠశాల, రంగోయి



శ్లాబ్ దశలో ఆగిపోయిన రంగోయి జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాలు

అసంపూర్తి భవనంలోనే చదువులు



నాడు–నేడు పథకం కింద ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన అసంపూర్తి భవనంలోనే పిల్లలు చదువులు సాగిస్తున్నారు. గతంలో మా గ్రామంలో ఒక పాఠశాల భవనం ఉండేది. అది శిథిలమైంది. దీంతో గ్రామస్తులు వేరే చోట రేకుల షెడ్‌ను ఏర్పాటు చేశారు. అందులో చదువుతుండేవారు. ఇప్పుడు అదీ బాగులేదు. తప్పని పరిస్థితులో అసంపూర్తి భవనంలోనే చదువుతున్నారు. అక్కడ ఎటువంటి సదుపాయాలు లేవు.

– టి.అప్పయ్య, విద్యార్థి తండ్రి, పూర్ణబద్ర, పలాస మండలం

నిధులు కేటాయిస్తేనే పనులు



ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ఏప్రిల్ నుంచి పనులు ప్రారంభమవుతాయి. నాడు–నేడు పథకాన్ని మనబడి–మన భవిష్యత్తుగా పేరు మార్చారు. గతంలో నిధులు ఉన్నట్టయితే ఆ నిధులను వెచ్చించి పూర్తి చేయాలని ప్రభుత్వం చెప్పింది. నిధులు విడుదలైతే భవనాలను పూర్తి చేయిస్తాం.

–సీహెచ్ సత్యం, ఎంఈవో– 2, పలాస

ఉగాది సందడి..




ఇచ్ఛాపురం మండలం భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు ఉగాది వేడుకలు శనివారం జరిగాయి. విశ్వావసునామ సంవత్సరం సందర్భంగా చిన్నారులు కొత్త బట్టలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి స్వీకరించారు. సీడీపీఓ పి.నాగరాణి, కార్యకర్త బర్రి నరసమ్మ ఉన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

రక్తదాన శిబిరం..



పలాస మండలం రామకృష్ణాపురంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శ్రీసత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా ఉగాదిని పురస్కరించుకొని ప్రాణదాత బ్లడ్ బ్యాంకు వారి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 79 యూనిట్ల రక్తాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది దానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీను, కార్యదర్శి శరత్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, మౌనిక, బ్లడ్ బ్యాంకు మేనేజర్ సాయి, సమితి కన్వీనరు ఇప్పిలి తిరుమల, జగదీష్ పాల్గొన్నారు. – పలాస

టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో అపశృతి



షాక్ గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జానకిరావు

వజ్రపుకొత్తూరు: మండలం కొత్తపేట గ్రామంలో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. ఉదయం టీడీపీ జెండా ఎగురవేసేందుకు ఇనుప పోల్ అమర్చుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు ఇనుప పోల్ తగిలి గుంటు జానకిరావు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న మరో యువకుడు బడే ధనరాజు చూసి యువకుడిని రక్షించే ప్రయత్నంలో అతడూ గాయపడ్డాడు. షాక్‌కు గురైన ఇద్దరినీ హుటాహుటిన సమీపంలోని పూండిలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు. అక్కడ సమయానికి చికిత్స అందడంతో యవకులు కోలుకున్నారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చున్నారు. అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. గ్రామానికి చెందిన టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గోవింద పాపారావు, అగ్నికుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఈశ్వరరావు, కర్ని రమణ, టీడీపీ నేతలు విద్యుత్ షాక్‌కు గురైన యువకులకు ఆస్పత్రిలో పరామర్శించారు.



ఇచ్ఛాపురం: బస్టాండ్ కూడలిలో జెండా దిమ్మ ఏర్పాటు చేయడంతో రోడ్డుపైనే వాహనాలను నిలిపివేసిన దృశ్యం

ఇచ్ఛాపురం/కవిటి/కాశీబుగ్గ: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇచ్ఛాపురం, కవిటి, కాశీబుగ్గ మండలాలు, మున్సిపల్ కేంద్రాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి.. ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా ఇచ్ఛాపురం పట్టణం బస్టాండ్ కూడలిలోని మున్సిపల్ స్థలంలో పార్టీ జెండా ఏర్పాటు కోసం దిమ్మను ఏర్పాటు చేయడంతో పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: వేసవి నేపథ్యంలో ప్రజలకు మంచి నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన 14 అంశాలతో కూడిన సాధారణ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. బడ్జెట్‌కు పరిపాలన ఆమోదం, సాధారణ నిధుల నుంచి చేయనున్న అభివృద్ధి పనులు, వేసవిలో నీటిసమస్య తలెత్తకుండా సాధారణ నిధులు వెచ్చించేందుకు, ఇటీవల జరిగిన రోడ్, కాలువల క్వాలిటీ కంట్రోల్ పరీక్షల నిర్వహణ, వీధికుక్కలకు వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయడానికి నిధులను కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కాగా సమావేశంలో టేబుల్ అజెండాగా మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ –2 లాబాల స్వర్ణమణిపై విధించిన అనర్హత వేటు అంశాన్ని తీసుకొచ్చారు. ఈ అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులకు మున్సిపల్ అధికారులు వివరించగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఈ అజెండాని అమోదిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఈ ఏజెండా విషయమై ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని వైస్‌చైర్‌పర్సన్ స్వర్ణమణి ఆరోపించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, మున్సిల్ వైస్‌చైర్‌పర్సన్–1 ఉలాల భారతిదివ్య ఉన్నారు.

మీటర్ రీడర్ల సమ్మె నోటీసు



టెక్కలి: డీఈఈ శంకరరావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న మీటర్ రీడర్లు

టెక్కలి: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్లు సమ్మెకు సమాయాత్తమవుతున్నారు. ఇందులో భాగంగా సమ్మె నోటీసును శనివారం సంబంధిత అధికారులకు అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి చాపాలని, ప్రతి నెలా వేతనాలు చెల్లించాలనే డిమాండ్లతో ప్రభుత్వానికి నివేదించినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో టెక్కలి డీఈఈ శంకరరావుతో పాటు ఏడీ, ఏఈలకు సమ్మె నోటీసులు అందజేశారు.

సోంపేట: సోంపేటలో కూడా సమ్మె నోటీసును మీటర్ రీడర్లు అందజేశారు. సమ్మెకు సహకరించాలని ఏడీఈ ఎం.రవిను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సోంపేట డివిజన్ అధ్యక్షులు కర్రి యాదవ్, పలాస ఉపాధ్యక్షులు ప్రసాదరావు పాణిగ్రాహి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రియాదవ్, ప్రతినిధులు గొనప ఆనంద్ ఉన్నారు.

ఉద్యోగాలకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు డిలైట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికై నట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. సీఎస్ఈ, ఐటీ, సీఎస్ఎం, ఈసీఈ, ట్రిపుల్‌ఈ తదితర విభాగాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై న వారిలో ఉన్నారన్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.4.5 లక్షల వేతనం లభిస్తోందన్నారు.

సేవారత్న అవార్డుకు రామారావు ఎంపిక

టెక్కలి: టెక్కలి సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయుడు చల్లా రామారావు అంబేడ్కర్ సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు. ఒంగోలుకు చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులో అవార్డు ప్రదానం చేయనున్నారు. రాజ్యాంగ రక్షణ కోసం రామారావు చేసిన కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

180 లీటర్ల సారాతో ఇద్దరు అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా, ద్విచక్ర వాహనంతో ఎక్సైజ్ సిబ్బంది

కంచిలి: కంచిలి మండలంలో ఎక్సైజ్, మొబైల్ పెట్రోలింగ్ టీం సిబ్బంది శనివారం ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా 180 లీటర్ల నాటుసారాతో ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. అరెస్టయిన వారిలో కంచిలి మండలం నువాగడ కాలనీకి చెందిన గురుప్రసాద్ కార్జీ, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన సుధీర్ ప్రధాన్‌లు ఉన్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. వీరికి సారాను సరఫరా చేస్తున్న ఒడిశాకు చెందిన ముగ్గురు, జె.నారాయణపురం, బొనామా శి గ్రామాలకు చెందిన ఇద్దరిపై కేసులు నమో దు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, సోంపేట మొబైల్ సీఐ జి.వి.రమణ, ఎస్సై సుజాత ఉన్నారు.

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

కాశీబుగ్గ: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడల్లా పరీక్షల నిర్వహణ గందరగోళంగా ఉంటుందని పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు బమ్మిడి సంతోష్ విమర్శించారు. ప్రశ్నపత్రాలు లీకవుతాయని, మాల్ ప్రాక్టీస్ ఉంటుందనే విషయం పలు సందర్భాల్లో రుజువైందని చెప్పారు. పలాసలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రిగా సీఎం తనయుడు లోకేష్ ఉన్నప్పటికీ వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీల గురించి ప్రభుత్వం పట్టిం చుకోవడం దారుణమన్నారు. పదో తరగతి పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.


రైల్వే జీఎం పర్యటన

టెక్కలి రూరల్: నౌపడ నుంచి గుణ్‌పూర్ రైల్వే లైన్ అభివృద్ధిలో భాగంగా శనివారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ నౌపడ నుంచి గుణ్‌పూర్ రైల్వే మార్గాన్ని పరిశీలించారు. దీనిలో భాగంగా నౌపాడ ఆర్‌ఎస్, టెక్కలి, పెద్దసాన తదితర స్టేషన్ల మౌలిక వసతులు, స్టేషన్‌లో ఉండవలసిన కనీస వసతులను తాను ప్రయాణిస్తున్న ప్రత్యేక రైలులో నుంచే పరిశీలించారు. అనంతరం టెక్కలి మీదుగా పర్లాఖిమిడి, గుణ్‌పూర్ వరకు వెళ్లారు.

సక్రమంగా రుణ ప్రణాళికలు

వజ్రపుకొత్తూరు: వార్షిక రుణప్రణాళికలు, జీవనోపాధులకు అవసరమైన పెట్టుబడి ప్రణాళికలు రూపొందించడంలో అలసత్వం వద్దని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ చింతాడ రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని మహిళా సమాఖ్య భవనంలో వీఓఏలకు, ఎన్యుమరేటర్లకు యాప్ వినియోగంపై శనివారం అగాహన కల్పించారు. వెలుగు ఏపీఎంలు జి.ప్రసాదరావు, ఈశ్వర్, సీసీలు హరిప్రియ, రేణుక, వెంకటరమణ పాల్గొన్నారు.

కుక్కలదాడిలో జింక మృతి



చనిపోయిన జింక

ఇచ్ఛాపురం టౌన్: కుక్కల దాడిలో జింక ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన ఇచ్ఛాపురం మున్సిపాలిటీ రత్తకన్న సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుందని అటవీశాఖ అధికారి ఎ.మురళీకృష్ణ తెలిపారు. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం వేకువజామున సుమారు మూడు సంవత్సరాల వయసు ఉండే ఆడజింక గ్రామ పరిసరాల్లోకి రాగా కుక్కలు దాడి చేయడంతో చనిపోయినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పశువైద్యాధికారులచే పోస్టుమార్టం జరిపించి గ్రామపెద్దల సమక్షంలో దహనం చేసినట్టు పేర్కొన్నారు. మందస డీఆర్వో రాము ఉన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

మందస: వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరు కోసం స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు ఇంటర్వ్యూ చేశారు. మండలానికి 110 మంది లబ్ధిదారులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 478 మంది దరఖాస్తు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

రైలు స్పీడ్ పెరిగింది..!

- నౌపడ–గుణుపూర్ మార్గంలో 50 నుంచి 75 స్పీడు సామర్థ్యం

టెక్కలి: నౌపడ–గుణుపూర్ బ్రాడ్‌గేజ్ మార్గంలో ప్రస్తుతం నడుస్తున్న రైలు స్పీడు సామర్థ్యం పెరిగింది. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే (భువనేశ్వర్) చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ సందీప్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం నౌపడ రైల్వే జంక్షన్ నుంచి టెక్కలి మీదుగా గుణుపూర్ వరకు గుణుపూర్–కటక్, గుణుపూర్–పూరీ, విశాఖ–గుణుపూర్, రూర్కెలా–గుణుపూర్, గుణుపూర్–విశాఖ, గుణుపూర్–రూర్కెలా, పూరీ–గుణుపూర్, కటక్–గుణుపూర్ వరకు రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం 50 కిలోమీటర్లుగా ఉన్న స్పీడును 75 కిలోమీటర్లకు పెంచినట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల పరిధిలో ట్రాక్ దాటేటప్పుడు వాహనదారులు, పాదాచారులు, పశువుల కాపరులు అప్రమత్తంగా రాకపోకలు సాగించాలని సూచించారు.

ఆక్రమణల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉన్న నేపథ్యంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఆదేశించారు. తన కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూముల, ఆక్రమణ, ఇసుక, మట్టి రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తమ దృష్టికి తేవడంలో విఫలం చెందుతున్నారన్నారు. పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాల ద్వారా తమకు తెలుస్తున్నాయన్నారు. ఇకపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని సూచించారు.

సందడిగా మార్కెట్

టెక్కలి: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగకు రైతులు సిద్ధమయ్యారు. అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో శనివారం టెక్కలి మార్కెట్ కళకళలాడింది. తొలి ఏరు కోసం అసరమైన వస్తువులను కొనుగోలు చేశారు.



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు

ఘనంగా నూకాలమ్మ సంబరం

ఇచ్ఛాపురం టౌన్:సంతపేట వద్ద ఉన్న నూకాలమ్మతల్లి సంబరమహోత్సవం శనివారం జరిగింది. ధర్మకర్త కోరు ప్రధాన్, సహాయ ధర్మకర్త కాళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తుగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ పర్యవేక్షణలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో పంచాంగ పఠనం చేపట్టారు.